
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 4 ఫిబ్రవరి 2024



బస్సుల్లేక పీఎన్‌బీఎస్‌లో అవస్థలు



సంసిద్ధంగా లేరు

దెందులూరు సభకు అంతంతమాత్రంగా వెళ్లిన కార్యకర్తలు

- జనం తరలింపునకు ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు
- జనం పెద్దగా లేకపోవడంతో వెనక్కి.
- బస్సుల్లేక ఆర్టీసీ ప్రయాణికులకు అష్టకష్టాలు

- 6లో..

ఇసుక దోపిడీ..!





ఘంటసాల మండలం పాపవినాశనం క్వారీలో భారీగా తవ్వకాలు (ఇన్‌సెట్‌లో) తోట్లవల్లూరు మండలం రొయ్యూరు క్వారీలో భారీ ఎక్స్‌కవేటర్లు

రెండు జిల్లాల్లో వైసీపీకి నెలకు రూ.90 కోట్ల ఆదాయం

ఇసుకను ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారు. నిన్నటి వరకు జేపీ సంస్థ ముసుగులో అధికార పార్టీ నాయకులు కృష్ణమ్మ గర్భాన్ని కొల్లగొట్టగా.. నేడు జీసీకేసీ సంస్థ పేరిట తాడేపల్లి పెద్దలే దోపిడీకి తెరతీశారు. ఒక్క నెలలో రూ.90 కోట్ల ఆదాయాన్ని జేబులో వేసుకుంటున్నారు. ఇసుక దోపిడీకి సాక్షాత్తూ సీఎం పేషీనే అండగా ఉండటంతో జిల్లా యంత్రాంగం చేష్టలుడిగి చూస్తూ ఉండిపోతోంది. ఎవరు తవ్వుతున్నారు.. ఎంత తవ్వుతున్నారు.. అనే లెక్కే లేదు. కలెక్టర్ ఆపమన్నా ఆపే ప్రసక్తే లేకుండా ఇరు జిల్లాల్లో ఇసుకను కొల్లగొట్టేస్తున్నారు.

పర్యావరణ అనుమతులు లేకున్నా తవ్వకాలు

- జీసీకేసీ సంస్థ పేరిట భారీగా తరలింపు
- లంకపల్లి రీచ్‌లో ప్రమాదకరస్థాయికి..
- నందిగామ రీచ్‌ల నుంచి తెలంగాణాకు తరలింపు
- వందల లారీల్లో ఇసుక హైదరాబాద్‌కు..
- తాడేపల్లి పెద్దల ఆశీస్సులతో అక్రమ రవాణా
- అధికారులు ఆపమంటున్నా బేఖాతరు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/నందిగామ/అవనిగడ్డ/తోట్లవల్లూరు) : కృష్ణాజిల్లాలోని చోడవరం, కాసరనేనిపాలెం, మద్దూరు, వల్లూరుపాలెం, రొయ్యూరు, లంకపల్లి, శ్రీకాకుళం రీచ్‌ల్లో నిత్యం లక్షల టన్నుల ఇసుకను తవ్వి తరలించేస్తున్నారు. అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ఘంటసాల మండలంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేయా లంటూ గతంలో గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ పాపవినాశనం క్వారీ నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు.

గత డిసెంబరులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ సంస్థ రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లకు ఈ-టెండర్లు పిలవగా, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన టెండర్‌ను జీసీకేసీ సంస్థ దక్కించుకుంది. ప్రకాశం బ్యారేజీ దిగువన ఉన్న అన్ని క్వారీల్లోనూ ఇసుక తవ్వకాలకు అనుమతి లేకున్నా జీసీకేసీ సంస్థ తవ్వకాలు జరిపేస్తోంది. జిల్లా యంత్రాంగం ఆ ఆదేశాలు పక్కనపెట్టి ఇసుక మాఫియాకు సహకరిస్తుండటం గమనార్హం. పైగా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని తహసీల్దార్లే ఎండార్స్‌మెంట్లు ఇస్తుండటం అధికార పార్టీ ఒత్తిళ్లకు నిదర్శనం.

తహసీల్దార్ ఆపినా..


తోట్లవల్లూరు మండలం రొయ్యూరు క్వారీకి అనుమతులు లేకున్నా జీసీకేసీ సంస్థ ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేస్తోంది. వాల్టా చట్టం నిబంధనలను సైతం ఉల్లంఘించి భూగర్భ జలాలకు ప్రమాదం కలిగేలా ఈ తవ్వకాలు జరుపుతున్నారు. కృష్ణాజిల్లాలోని క్వారీలన్నీ ప్రభుత్వం తమకు ఇచ్చిందంటూ జీసీకేసీ సంస్థ అడ్డగోలుగా తవ్వకాలు

- మిగతా 6లో

నేడు జనసేనలోకి ఎంపీ బాలశౌరి

జనసేనాని పవన్ కల్యాణ్ సమక్షంలో చేరిక

- మంగళగిరి పార్టీ కార్యాలయంలో భారీ ఏర్పాట్లు
- జిల్లా నుంచి భారీగా వెళ్లనున్న జన సైనికులు



మచిలీపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆదివారం జనసేనలో చేరనున్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సమక్షంలో సాయంత్రం 4.30 గంటలకు ఆయన చేరడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గుంటూరు నుంచి నేరుగా ఆయన మంగళగిరి చేరుకుంటారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బాలశౌరి అభిమానులు, అనుచరులు, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆదివారం మధ్యాహ్నం నుంచి మంగళగిరికి ర్యాలీగా తరలి వెళ్లేందుకు రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసుకున్నారు. జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆధ్వర్యంలో 100కు పైగా కార్లలో జనసైనికులు తరలివెళ్లనున్నారు. అవనిగడ్డ నియోజకవర్గం నుంచి మచిలీపట్నం మీదుగా మంగళగిరికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.

వైసీపీ నుంచి జనసేనలోకి..

2019లో వైసీపీ నుంచి ఎంపీగా ఎన్నికైన వల్లభనేని బాలశౌరి ఇటీవల కాలంలో జిల్లాలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ పార్టీకి రాజీనామా చేశారు. జనసేన తరఫున మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా ఇప్పటికే ఆయన పేరును అధికారికంగా ప్రకటించారు. టీడీపీ, జనసేన కలయిక నేపథ్యంలో బాలశౌరి మచిలీపట్నం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనుండటంతో జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ఆయన ప్రభావం వైసీపీపై పడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.





విన్నకోట శివారు జేమ్స్‌పేటలో రాజేష్‌ను పరామర్శిస్తున్న జనసేన నాయకులు

జనసేన దళిత కార్యకర్త ఇంటికి నిప్పు

- అర్ధరాత్రి పెట్రోల్ పోసి తగలబెట్టిన దుండగులు
- స్థానికుల అప్రమత్తతతో తప్పిన ముప్పు..కుటుంబం సురక్షితం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 3: మండలంలోని విన్నకోట గ్రామ శివారు జేమ్స్‌పేటలో జనసేన దళిత కార్యకర్త కాటూరి రాజేష్ రేకుల ఇంటికి శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు పెట్రోలు పోసి నిప్పంటించారు. కుటుంబసభ్యులతో కలిసి రాజేష్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఈ దారుణానికి ఒడిగట్టారు. పాల్పడ్డారు. మంటల వేడికి రాజేష్, కుటుంబ సభ్యులకు మెళకువ వచ్చి బయటకు వచ్చేశారు. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో అందరూ కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. ఒక గదిలో మంచం, టీవీ మంటల్లో కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్‌పోసి ఇంటికి నిప్పంటించారని రాజేష్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్సై సత్యనారాయణ సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న జనసేన నాయకులు సందు పవన్, పార్టీ మండల అధ్యక్షుడు తోట చిన్నారి, జిల్లా కార్యదర్శి పేర్ని జగన్ తదితరులు శనివారం జేమ్స్‌పేటలోని రాజేష్ ఇంటికి వెళ్లి, కుటుంబసభ్యులను పరామర్శించారు. రాజేష్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పోలీసు అధికారులతో మాట్లాడి ఘటనకు కారకులైన వారికి శిక్షపడేలా చూస్తామన్నారు. తూము వెంకటరత్నం, నోబుల్‌నాయుడు పాల్గొన్నారు. .

నర్సింగ్ కళాశాలకు రేపు శంకుస్థాపన

- ఏర్పాట్లు చేయాలని అధికారులకు కృష్ణా కలెక్టర్ రాజాబాబు ఆదేశం

మచిలీపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపనను సోమవారం సాయంత్రం 4గంటలకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ వర్చువల్ పద్ధతిలో చేస్తారని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. శంకుస్థాపన ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. నర్సింగ్ కళాశాల శంకుస్థాపన పనుల ఏర్పాట్లపై మెడికల్ కళాశాల అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఇందుకు వేదికను సుందరంగా తీర్చిదిద్దాలని, ఎక్కడ ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ పరిశీలకుడు ధీరజ్‌కుమార్, మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి, మచిలీపట్నం ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ ఆశాలత, డీఎంఈ డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



నడకుదురు రేవులో..

బుసుక తవ్వకాలు జరిపిన ప్రదేశం, రైతులు అడ్డుకోవడంతో రాత్రివేళ రేవులోనే బుసకను అన్‌లోడ్ చేస్తున్న టిప్పర్



బుసక తవ్వకాలు

అడ్డుకున్న రైతులు..జగనన్న లే అవుట్ పేరుతో బయటకు తరలిస్తున్నారని ఆగ్రహం

చల్లపల్లి, ఫిబ్రవరి 3: మండలంలోని నడకుదురురేవులో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న బుసక తవ్వకాలను రైతులు అడ్డుకున్నారు. శుక్రవారం రాత్రి తవ్వకాలు జరుగుతుండటంతో నడకుదురు, పురిటిగడ్డ, రాముడుపాలెం గ్రామాలకు చెందిన 20 మంది రైతులు, యువకులు తవ్వకాలు జరిగే ప్రదేశానికి వెళ్లారు. రాత్రివేళల్లో తవ్వకాలు ఏమిటని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరపటానికి వీల్లేదని, పంటపొలాలకు దగ్గరగా తవ్వకాలు చేస్తే భూగర్భజలాలకు ముప్పు ఏర్పడుతుందని, తవ్వకాలు నిలుపుదల చేయాలని పట్టుబట్టారు. రేవులో ఏడు టిప్పర్లు లోడై ఉండటంతో వాటిలోని బుసకను రేవులోనే అన్‌లోడ్ చేయించారు. బుసక అన్‌లోడ్ చేసేందుకు తొలుత ఒప్పుకోనప్పటికీ రైతులు పట్టుబట్టడంతో ఎట్టకేలకు అన్‌లోడ్ చేసి టిప్పర్లు వెళ్లిపోయాయి. రేవులో ఉన్న బుసకను తవ్వే ప్రొక్లెయిన్‌ను తీసుకెళ్లిపోవాలని సూచించారు. లారీలో ఉదయాన్నే తీసుకెళతామని డ్రైవర్ చెప్పి, తవ్వకం జరిగే ప్రదేశం నుంచి యంత్రాన్ని వెనక్కి తీసుకువచ్చాడు. దీంతో రైతులు వెనుతిరిగివచ్చేశారు.

పాగోలు జగనన్న లే అవుట్ పేరుతో విక్రయాలు

బుసక తవ్వకాలపై ప్రశ్నిస్తే పాగోలు జగనన్న లే అవుట్‌కు బుసకను తోలుతున్నామని చెబుతున్నారని, కానీ ఆ పేరుతో బుసకను బయట అనధికారికంగా విక్రయిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లేఅవుట్‌కు కంటే బయటకే భారీగా బుసక తరలిస్తున్నారని ఆరోపించారు.

రైతుల భవిష్యత్‌తో చెలగాటమాడితే ఊరుకోం

- టీడీపీ నేతల హెచ్చరిక

నడకుదురు రేవులో బుసక తవ్వకాలు జరిపిన ప్రదేశాన్ని టీడీపీ నేతలు మోర్ల రాంబాబు, పరుచూరి సురేష్‌బాబు, కైతేపల్లి శ్రీనివాసరావు, పరిశే మౌళి, రాజులపాటి జగదీష్ శనివారం మధ్యాహ్నం పరిశీలించారు. అర్ధరాత్రి ఇవతలకు వచ్చేసిన ప్రొక్లెయిన్ తిరిగి బాటను సరి చేసుకుంటూ కనిపించేసరికి రైతులు, నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల భవిష్యత్‌తో చెలగాటం ఆడటం మంచిది కాదనీ, మరోసారి తవ్వకాలు చేపడితే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. దీంతో డ్రైవర్లు అక్కడి నుంచీ వెళ్లిపోయారు.



నడకుదురు రేవులో తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు, రైతులు



ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్షకు సంఘీభావం తెలుపుతున్న దేవినేని ఉమా, అక్కల రామ్మోహన్‌రావు

అధికార పార్టీ నేతలు బూడిదను
పందికొక్కుల్లా తిన్నారు

- దేవినేని ఉమా ఆరోపణ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 3: అధికారపార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు భాగస్వాములై బూడిదను పందికొక్కులా దోచుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. బూడిద అనధికార రవాణా నిలిపి వేయాలంటూ టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన రా..కదిలిరా నిరసన దీక్షకు జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు అక్కల రామ్మోహన్‌రావుతో కలిసి ఆయన సంఘీభావం తెలిపారు. థర్మల్ స్టేషన్ లోపల చేయాల్సిన పనులు చేయకుండా బూడిదను డ్రైయినేజీలోకి రప్పించి జేసీబీలు పెట్టి బూడిదను తరలిస్తున్నారని ఉమా ఆరోపించారు. బూడిద చెరువులో వేలాది లారీలతో అడ్డగోలుగా దోచేస్తున్నారన్నారు. వీటీపీఎస్‌లోని ఉన్నతాధికారులందర్నీ డమ్మీలను చేశారన్నారు. పెద్దిరెడ్డి ఓఎస్డీ డీఈ భాస్కరరావుదే ఈ పాపమంతా అన్నారు. నిరసన దీక్షకు టీడీపీ మాజీ కార్యదర్శి జంపాల సీతారామయ్య సంఘీభావం తెలిపారు.

వైద్యకళాశాల, ప్రభుత్వాస్పత్రిలో
పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 3: విజయవాడ ప్రభుత్వ సిద్ధార్థ వైద్యకళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆడియో టెక్నీషియన్(1), రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్(1), స్పీచ్ థెరపిస్ట్(2), సీ-ఆర్మ్‌టెక్నీషియన్(2), ఓటీ టెక్నీషియన్(5), ఈఈజీ టెక్నీషియన్(2), డయాలసిస్ టెక్నీషియన్(2), జనరల్ డ్యూటీ అటెండెంట్(17), సిటీ టెక్నీషియన్(3), క్లినికల్ ఫార్మసిస్ట్(1), స్టోర్ కీపర్ కం క్లర్క్(3), ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్ లీ(6) మేల్ నర్సింగ్ ఆర్డర్ లీ(3), అటెండర్స్(3) మొత్తం 50 పోస్టులకు క్రాంటాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకాలకు దరఖాస్తులుకోరుతున్నట్లు తెలిపారు.

బాలశౌరికి మద్దతుగా..

- వందకార్లు, పది బస్సుల్లో మంగళగిరికి తరలివెళ్తున్నాం
- ఎంపీతో పాటు, ఆయన అనుచరులూ పవన్ సమక్షంలో పార్టీలో చేరుతున్నారు
- జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 3: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో ఆదివారం మధ్యాహ్నం వైసీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి పార్టీలో చేరుతున్నారని ఆయనకు మద్దతుగా మచిలీపట్నం నుంచి పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు మంగళగిరికి వందకార్లు, పది బస్సుల్లో తరలి వెళ్తున్నామని ఆమచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకుల నియంతృత్వపు పోకడలకు విసిగిపోయిన ఎంపీ బాలశౌరి, పలువురు అనుచరులూ జనసేన పార్టీలో చేరుతున్నారని తెలిపారు. మంగళగిరికి తరలి వెళ్తున్నారన్నారు. కార్యక్రమానికి వెళ్తున్న నాయకులకు, కార్యకర్తలకు పార్టీ కార్యాలయం వద్ద భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. నగరం నుంచే కాకుండా గ్రామాల నుంచి కూడా భారీ సంఖ్యలో వాహనాల్లో మంగళగిరికి తరలి వెళ్తున్నారన్నారు. మంగళగిరిలో ఆదివారం సాయంత్రం నాలుగున్నర గంటలకు బాలశౌరి జనసేన పార్టీలో చేరతారన్నారు. బాలశౌరి గుంటూరు నుంచి మంగళగిరికి వస్తారన్నారు.

పేర్ని నాని తీరుతోనే వైసీపీని వీడుతున్నాం: మాదివాడ, కోసూరి

మచిలీపట్నం టౌన్: బందరు ఎమ్మెల్యే పేర్నినాని తీరుతోనే వైసీపీకి రాజీనామా చేసి ఎంపీ వల్లభనేని బాలశౌరితో పాటు జనసేనలో చేరుతున్నామని వైసీపీ సీనియర్ నాయకులు మాదివాడ రాము, మాజీ కౌన్సిలర్ కోసూరి నాంచారయ్య యర్రంశెట్టి నాని పేర్కొన్నారు. శనివారం కోసూరి నాంచారయ్య కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాదివాడ రాము మాట్లాడారు. ఎంపీ బాలశౌరి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు పేర్ని నాని అడుగడుగునా అడ్డుపడ్డారన్నారు. ఏళ్ల తరబడి చూసిచూసి విసిగిపోయి పార్టీని వీడాల్సి వచ్చిందన్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి నిస్వార్థంగా పనిచేస్తున్నప్పటికీ తనపై పది కేసులు పెట్టారని, అయినప్పటికీ పార్టీని వీడలేదన్నారు.

జనసేనలోకి వైసీపీ ఎంపీటీసీ



మేకా బంగారుబాబు

చల్లపల్లి: వైసీపీలో కొంతకాలంగా అసంతృప్తిగా ఉన్న పాగోలు ఎంపీటీసీ సభ్యుడు మేకా సత్యనారా యణప్రసాద్ (బంగారుబాబు) ఎంపీ బాలశౌరి వెంట అడుగులు వేయనున్నారు. మండలంలో బాలశౌరికి దగ్గరగా, ఎంపీ అనుచరవర్గంగా ఉండేవారిలో బంగారు బాబు ముఖ్యుడు. వైసీపీకి రాజీనామా చేసి బయటకు వచ్చిన బాలశౌరి ఇటీవల మోపిదేవి దేవాలయానికి వచ్చిన సమయంలోనూ బంగారుబాబు అనుచరులతో కలిసి వెళ్లి ఆయనను కలిశారు. బాలశౌరితోపాటు జనసేనలో చేరేందుకు నిర్ణయించుకున్నానని తెలిపారు.

ఇద్దరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈల సస్పెన్షన్

మచిలీపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ మచిలీపట్నం విభాగం ఏఈలు ఇద్దరిని సస్పెండ్‌చేస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ ఆర్వీ రవికుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల మచిలీపట్నం మంచినీటి పథకం, ఆకుమర్రు మంచినీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ పరిశీలించారు. ఈ రెండు పథకాలకు సురక్షిత మంచి నీటిని సరఫరా చేయకపోవడం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం ఆయన పరిశీలనలో వెల్లడయ్యాయి. ప్రభుత్వం రెండు పథకాల నిర్వహణ నిమిత్తం 2022-23ఆర్థిక సంవత్సరానికి రూ.2.19కోట్ల చొప్పున విడుదల చేసిన నిధులను, జడ్పీ నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగించలేదని ఆయన పరిశీలనలో తేలింది. ఆకుమర్రు మంచినీటి పథకం ఏఈ ఎం.సుగుణకుమారి, మంగినపూడి మంచినీటి పథకం ఏఈ నాగారాజును సస్పెండ్‌చేస్తూ ఫిబ్రవరి 1వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. సుగుణకుమారి గుడివాడ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అసలు పోస్టింగ్ కాగా, మచిలీపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో డెప్యుటేషన్‌పై దీర్ఘకాలంగా పనిచేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు
కల్పిస్తాం: సీడీపీవో భానుమతి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కూచిపూడి, ఫిబ్రవరి 3: అలసత్వం వహించకుండా అంగన్వాడీ కేంద్రాలో తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం, భవనాల మరమ్మతులు, ఇతర సౌకర్యాల కల్పిస్తామని స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారిత జిల్లా అధికారిణి ఎస్.సువర్ణకు మొవ్వ సీడీపీవో భానుమతి వివరించారు. మొవ్వ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు అసౌకర్యాలతో కునారిల్లుతున్నాయని శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సీడీపీవో భానుమతిని స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారిత జిల్లా అధికారిణి వివరణ కోరారు. దీనిపై సీడీపీవో స్పందించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఫ్లోరింగ్, ఇతర మరమ్మతులు, టాయిలెట్ల కోసం నిధులు మంజూరయ్యాయని నిధులు జమయిన వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. పాడైపోయిన వాటర్ ప్యూరిఫైర్లను వీలైనంత త్వరగా వినియోగంలోకి తెస్తామని తెలిపారు. ఇటీవల అంగన్వాడీలు ధర్నాలో పాల్గొనటం వల్ల, పిల్లలు ఇళ్లకు వెళ్లటం వల్ల విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉందని, నూరుశాతం హాజరయ్యేలా చూడాలని ఆయాలు, కార్యకర్తలతోపాటు సూపర్‌వైజర్లకు ఆదేశాలిచ్చామన్నారు.

గోనె సంచులివ్వాలి

- రామన్నపూడి ఆర్బీకేకు గడియపెట్టి రైతుల నిరసన



రామన్నపూడి ఆర్బీకే గేట్లు మూసి నిరసన తెలుపుతున్న తట్టివర్రు మాజీ సర్పంచ్ కైలా బాలయ్య

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 3: గుడివాడ మండలంలో ఆర్బీకేల వద్ద గోనె సంచులు పది రోజుల నుంచి దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తట్టివర్రు మాజీ సర్పంచ్ కైలా బాలయ్య, తట్టివర్రు రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. రామన్నపూడి ఆర్బీకేకు తట్టివర్రు రైతులు కొందరు గడియపెట్టి ఆర్బీకే ముందు తమ అసంతృప్తిని నిరసన రూపంలో తెలియజేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు గోనె సంచులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. "రామన్నపూడి, తట్టివర్రు, సిపూడి, కాశీపూడి గ్రామాలకు రామన్నపూడి ఆర్బీకే సెంటర్ ఉంది. తట్టివర్రు రైతులు ధాన్యాన్ని నూర్పిడి చేసి వారం నుంచి ఆర్బీకేల చుట్టూ ధాన్యం సంచుల కోసం తిరుగుతున్నాం. ఆర్బీకేలలో ధాన్యం సంచులు లేకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులను సంప్రదించినా ప్రయోజనం లేదు." అని కైలా బాలయ్య తదితర రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.







రెడ్డిగూడెం, మోపిదేవిలో జనం లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లేందుకు సిద్ధంగా బస్సులు, ప్రయాణికుల ఇబ్బందులపై బందరులో ఆర్టీసీ అధికారులకు వినతిపత్రమిస్తున్న టీడీపీ నేతలు

సంసిద్ధంగా లేరు!

దెందులూరు సభకు.. అంతంతమాత్రంగా వెళ్లిన జనం

- సభకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ, ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు
- సభకు వెళ్లేందుకు జనం పెద్దగా రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లిన బస్సులు
- ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికుల పాట్లు

రెడ్డిగూడెం, ఫిబ్రవరి 3: దెందులూరులో వైసీపీ సిద్ధం సభకు రెడ్డిగూడెం మండలం నుంచి జనాన్ని తరలించేందుకు భారీగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు పంపారు. అయితే సభకు వెళ్లేందుకు నాయకులు కాని, జనం కాని ఆసక్తి చూపలేదు. దీంతో వచ్చిన వాటిలో చాలా బస్సులు ఖాళీగానే వెనుతిరిగి వెళ్లాయి. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సిద్ధం సభకు తాను హాజరు కానని చెప్పడంతో పాటు జనసమీకరణ కూడా చేయనని చెప్పడంతో ఒక్క రోజులోనే మైలవరం ఇన్‌చార్జిని వైసీపీ మార్పి వేసింది. ఈక్రమంలో సభకు జనాన్ని నడిపించే నాయకులు మాకెందుకులే అని మిన్నకున్నారు. దీంతో బస్సులు ఖాళీగా వెనుతిరగాల్సి వచ్చింది. మొత్తం మీద వైసీపీలో తీవ్ర నైరాశ్యం నెలకొంది.

రూ.300, బిర్యానీ ప్యాకెట్ ఇచ్చి..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలం నుంచి దెందులూరులో సిద్ధం సభకు ఒక్కొక్కరికీ రూ 300, బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేసి, ఆర్టీసీ బస్సుల్లో జనాన్ని వైసీపీ నేతలు తరలించారు.

వైసీపీ కార్యకర్తల్లా ఆర్టీసీ అధికారులు

- మోటమర్రి బాబాప్రసాద్ ఆగ్రహం

మచిలీపట్నం టౌన్: దెందులూరు సభకు ఆర్టీసీ బస్సులను పెద్ద సంఖ్యలో తరలించారని, దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆర్టీసీ అధికారులు వైసీపీ కార్యకర్తల్లాగా పనిచేస్తున్నారని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు చిన్నం సురేష్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నగర పాలక అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, అసీం బేగ్ తదితరులు ఆందోళన చేశారు. అధికారులకు వినతిపత్రమిచ్చారు.

బస్సులు లేక ప్రయాణికుల పాట్లు

అవనిగడ్డ రూరల్: దెందులూరు సభకు అవనిగడ్డ డిపో నుంచి ఆర్టీసీ బస్సులు భారీగా వెళ్లటంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, మోపిదేవి మండలాలకు చెందిన ప్రైవేట్ పాఠశాలల బస్సులను తీసుకున్నారు. బస్సులు లేకపోవడంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు.

సిద్ధం సభ కోసం..
ఇంటర్ పరీక్ష వాయిదా సిగ్గుచేటు

- ఎన్నికలకు ముందు డీఎస్సీనా?: నెట్టెం

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 3: దెందులూరులో నిర్వహించే సిద్ధం సభ సభ కోసం ఇంటర్ పబ్లిక్ పరీక్షలను వాయిదా వేయడం సిగ్గుచేటని, సీఎం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం సరికాదని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జగ్గయ్యపేటలోని తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. యువతను గంజాయి మత్తులో చిత్తు చేస్తున్నారన్నారు. మద్యం, గంజాయి, ఇసుక, మట్టి అనధికార ఆదాయం ద్వారా తాడేపల్లి బొక్కసాన్ని నింపుకొని, ఆ డబ్బుతో వచ్చే ఎన్నికల్లో గెలవాలని జగన్‌రెడ్డి భావిస్తున్నారని, ఆయనకు శృంగభంగం తప్పదని హెచ్చరించారు. ఆర్థిక నేరస్థుడు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు 10 రోజుల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వటం నిరుద్యోగులను మోసం చేయటం కాదా అని నెట్టెం ప్రశ్నించారు.

ప్రైవేట్ పాఠశాలలకు సెలవిచ్చి..
దెందులూరు సభకు బస్సులు



మోపిదేవిలో ప్రైవేట్ పాఠశాలల బస్సులు

మోపిదేవి: మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలకు జిల్లా విద్యాశాఖాధికారులు సెలవు ప్రకటించారు. సిద్ధం సభకు ఆ పాఠశాలల బస్సుల్లో వైసీపీ కార్యకర్తలను తరలించారు. మోపిదేవి మండలంలోని ఆయా గ్రామాల్లో 8 బస్సులు ఏర్పాటు చేయగా, ఏడు బస్సుల్లో అంతంత మాత్రంగా కార్యకర్తలు, జనాన్ని ఎక్కించగా, ఒక ఆర్టీసీ బస్సులో ఎక్కే జనం లేక బస్సును వెనుతిరిగి పంపించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.

ఇసుక దోపిడీ..!

(ఐదో పేజీ తరువాయి)

జరుపుతోంది. అనుమతి లేదని గత గురువారం తహసీల్దార్ ఎం.కుసుమకుమారి ఈ ఇసుక తవ్వకాలను నిలిపివేయించారు.

లంకపల్లి రీచ్‌లో ప్రమాదకరంగా..

పమిడిముక్కల మండలం లంకపల్లి ఇసుక రీచ్‌లో ఇసుకకు మంచి డిమాండ్ ఉంది. దీంతో ఇక్కడ కృష్ణానది గర్భంలో తాటిచెట్టు లోతున ఇసుకను తవ్వేశారు. రెండు జిల్లాల నుంచి నిత్యం 30 వేల టన్నుల ఇసుకను తరలిస్తుంటే, ఒక్క లంకపల్లి రీచ్ నుంచే నిత్యం 5వేల టన్నులు తరలుతోంది. ఈ తవ్వకాల కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలమట్టం తగ్గిపోయి ఉప్పునీరు వస్తోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో గత సెప్టెంబరులో స్థానిక అధికార పార్టీ నాయకులు కలెక్టర్ రాజాబాబును కలిసి లంకపల్లి రీచ్‌లో తవ్వకాలు ఆపేలా చూడాలని కోరారు. కలెక్టర్ ఆదేశించి 24 గంటలు కూడా గడవకముందే మళ్లీ యథాతథంగా తవ్వకాలు మొదలుపెట్టారు.

తెలంగాణకు తరలిస్తూ..

ఎన్టీఆర్ జిల్లా నుంచి ఇసుక భారీగా తెలంగాణాకు తరలిపోతోంది. నిబంధనల ప్రకారం ఇసుకను పొరుగు రాష్ట్రాలకు తరలించకూడదు. కానీ, సీఎం పేషీ ఆశీస్సులు ఉండటంతో ఈ నిబంధనలను పెద్దగా పట్టించుకోవట్లేదు. నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో కంచికచర్ల మండలం చెవిటికల్లు, మున్నలూరు రీచ్‌లలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నెల్లూరు, చెన్నై నుంచి వచ్చిన గుత్తేదారుడి సిబ్బంది పర్యవేక్షణలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇందుకోసం రేయింబవళ్లు ఆరు యంత్రాలు పనిచేస్తున్నాయి. టన్ను ఇసుక రూ.475. గత నెలలో ర్యాంపు నిర్వహణ పేరుతో రూ.500 నుంచి రూ.2 వేల వరకు బలవంతంగా వసూలు చేశారు. దీనిపై లారీ యజమానులు, డ్రైవర్లు ఆందోళన చేయటం, పత్రికల్లో కథనాలు రావటంతో బాట పేరుతో సొమ్ము వసూలు చేయటాన్ని నిలిపివేశారు. ఈ రెండు రీచ్‌లకు తెలంగాణ లారీలే ఎక్కువగా వస్తున్నాయి. స్థానిక లారీలకు టన్ను, అరటన్ను తప్ప ఓవర్‌లోడ్ వేయటం లేదు. తెలంగాణా లారీలకు మాత్రం భారీగా ఓవర్‌లోడ్ వేస్తున్నారు. ఒక్కో లారీకి రూ.25 వేల వంతున తీసుకుని, 50 టన్నుల వరకు లోడ్ చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణాలో ఇసుకకు డిమాండ్ ఎక్కువగా ఉంది. సమ్మక్క-సారలక్క జాతరకు ఏర్పాట్లు జరుగుతుండటంతో మణుగూరులో గోదావరిలో ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. దీంతో చెవిటికల్లు, మున్నలూరు రీచ్‌ల నుంచి ఇసుక భారీగా హైదరాబాద్, ఖమ్మం తరలిపోతోంది. నిబంధనలకు విరుద్ధంగా వందల సంఖ్యలో ఇసుక లారీలు పక్క రాష్ట్రానికి వెళ్తున్నా నిలువరించే ధైర్యం ఒక్క అధికారికి కూడా లేకుండాపోయింది. కొన్ని లారీలు చిల్లకల్లు, వత్సవాయి, బోనకల్లు రూటులో, ఇంకొన్ని కంచికచర్ల, ఎర్రుబాలెం, మధిర రూటులో ఖమ్మం వెళ్తున్నాయి. హైదరాబాద్ వెళ్లే లారీలు నేరుగా జాతీయ రహదారి మీదుగా వెళ్తుండటం విశేషం. తెలంగాణ లారీలకు సరిహద్దు గ్రామాల పేరుతో వే బిల్లులు ఇస్తున్నారు. అయితే, సరిహద్దుల వద్ద ఇసుక లారీలను ఆపటానికి అధికారులకు ధైర్యం చాలట్లేదు. తాడేపల్లి నుంచి నేరుగా ఆదేశాలు వెలువడుతుండటంతో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడట్లేదు.

- చందర్లపాడు మండలంలో కాసరబాద ఇసుక రీచ్‌లో అధికార పార్టీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. దూరం ఎక్కువగా ఉండటంతో ఈ రీచ్‌కు తెలంగాణ లారీలు ఎక్కువగా రావట్లేదు. రోజుకు 50లోపు మాత్రమే లారీలు వస్తున్నాయి.
- నందిగామ మండలంలో మునేటిపై ఉన్న కంచెల రీచ్‌లో కూడా తవ్వకాలు జరుగుతున్నాయి. కంచెల వైపు నిల్వలు అయిపోవటంతో ఇసుక దొరకట్లేదు. దీంతో కొద్దిరోజుల నుంచి కంచికచర్ల మండలం పెండ్యాల వైపు ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడకు రోజుకు 25 లారీలే వస్తున్నాయి.
- వత్సవాయి మండలంలో మునేటిపై ఉన్న కన్నెవీడు రీచ్‌లో తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ రీచ్ ఇసుక బోనకల్లు మీదుగా ఖమ్మం తరలిపోతోంది. ఇక్కడకు 25 నుంచి 50 లారీలు వస్తున్నాయి. రీచ్‌లో పగలు ఇసుక లోడ్ అయ్యాక లారీలను లింగాల వద్ద నిలుపుతారు. చీకటి పడగానే ఇసుక లారీలు ఒకదాని వెంట ఒకటి ఎలాంటి ఆటంకం లేకుండా ఖమ్మం వెళ్తాయి.

జోగి రూటు సప'రేటు'

పెనమలూరు నియోజకవర్గంలోని మద్దూరు, వల్లూరుపాలెం, చోడవరం, రొయ్యూరు, యనమలకుదురు, పులిపాక ఇసుక రీచ్‌లన్నింటిలోనూ జోగి రమేశ్ మనుషులు చొరబడిపోయారు. నదిలో ఇసుకతో పాటు సమీప ప్రాంతాల్లోని బుసకకు రేటు కట్టి తన అనుచరగణానికి అప్పగించేశారు. వణుకూరుకు చెందిన ఓ వ్యక్తి మంత్రికి రూ.25 లక్షలు ముట్టజెప్పి ఆ ప్రాంతంలో బుసక తోలకానికి అనుమతి పొందాడని, మిగిలిన ప్రాంతాలకు భారీగా ధరలు కట్టి వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుని పట్టుమని నెల కూడా గడవకముందే ఎన్నికల ఖర్చు కోసం పిండేయడానికి జోగి సిద్ధమైనట్లు సొంత పార్టీ నాయకులే చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.33

జగన్ సభకు డబ్బులు ఇచ్చినా జనం కరువు

కంకిపాడు, ఫిబ్రవరి 3 : డబ్బులు ఇచ్చినా జగన్ సభలకు జనం రావడం లేదని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ, దెందులూరులో నిర్వహించిన సిద్ధం సభకు ప్రజలు కరువయ్యారన్నారు. స్కూల్స్‌కు సెలవు ఇచ్చి మరీ బస్సుల్లో జనంను తరలించేందుకు అధికార పార్టీ నాయకులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందన్నారు. మందు, విందు, రూ.500 ఇచ్చినా మేము రామంటూ జనం వెళ్లి పోతున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్ని కల్లో అధికార పార్టీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బొప్పూడి శివరామకృష్ణ, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్, షేక్ బాజి తదితరులు పాల్గొన్నారు.

కంటి కేన్సర్‌పై అవగాహన

పెనమలూరు, ఫిబ్రవరి 3 : ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి క్యాపంస్ హెడ్ డాక్టర్ అనసూయ గంగూలీ కపూర్ తెలిపారు. మూడేళ్ల లోపు పిల్లల్లో సంభవించే రెటీనో బ్లాస్టోమా కంటి కేన్సర్ పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లల కంట్లో తెల్లని ప్రతిబింబం కంటి కేన్సర్‌కు సంకేతం కావచ్చని, అటువంటి పరిస్థితి కనిపిస్తే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కేన్సర్ కేసులలో అధిక భాగం చివరి దశలో గుర్తించడం, సకాలంలో సరైన చికిత్స అందకపోవడం కారణంగా 50శాతం యువత ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు.

మైనింగ్ సొమ్ముతో ఎన్నికలకు వైసీపీ

ఈడుపుగల్లు (కంకిపాడు), ఫిబ్రవరి 3 : అధికార పార్టీ నాయకులు ఇసుక అక్రమతరలింపు ద్వారా వచ్చిన సొమ్ముతో ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బులు పంచేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారన్నాని, అక్రమ మైనింగ్ పెద్ద ఎత్తున జరుగుతున్నా అధికారులు మొద్దునిద్ర వహించటం దురదృష్టకరమని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. స్థానికంగా ఆయన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవినీతికి అంతులేకుండా పోయింద న్నారు. దోచుకో..దాచుకో అన్న చందాన పాలన ఉందన్నారు. మంత్రి జోగి రమేశ్ పేదలకు చేసిందేంటో చెప్పాలన్నారు. ఓటుకు రూ. 2 వేల నుంచి 5 వేలు వరకు పంచేందుకు మంత్రి జోగి సిద్ధంగా ఉన్నారని, ప్రజలు మాత్రం మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వెంటే ఉన్నారన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, షేక్ షకార్, సుధాకర్, చెల్లి సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువతకు భవిష్యత్తు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 3 : టీడీపీతోనే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయని, యువత బంగారు భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యమవుతుందని తెలుగు యువత మండల అధ్యక్షుడు కలపాల సూర్యనారాయణ అన్నారు. కొత్తపల్లి టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన యువదళం సభ సన్నాహక సమావేశంలో మండల కార్యదర్శి పుట్టా సురేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. తెలుగు యువత ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4వ తేదీన గన్నవరంలో నిర్వహించనున్న యువదళం సభను జయప్రదం చేయాలన్నారు. ఎన్నికల్లో యువత పోషించాల్సిన పాత్ర, ఓటర్ల జాబితా తదితర విషయాల గురించి చర్చించేందుకు నిర్వహించే యువ దళం సభ ద్వారా సత్తా చూపేలా 27 గ్రామాల్లోని యువత తరలి రావాలని పిలుపు నిచ్చారు. బిళ్లనపల్లి, మడిచర్ల, వేలేరు, రేమల్లె, మల్లవల్లి టీడీపీ కమిటీల ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి అధ్యక్షుడు వల్లూరిపల్లి రామకృష్ణప్రసాద్, పొట్లూరి సుధాకర్, అక్కినేని రవి, షేక్ ఇమ్రాన్, అక్కినేని గోకుల్, తమ్మినేని రాజారావు, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి కలపాల కుమార్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష ఉపకరణాలు

ఉంగుటూరు, ఫిబ్రవరి 3 : విద్యార్థులకు దాతలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని పెద అవుటపల్లి జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం కె.శేషుకుమారి ఆకాం క్షించారు. కీర్తిశేషులు బోయపాటి వెంకటసుబ్బయ్య, సుబ్బమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు సీతారామాంజనేయులు(అమెరికా),శ్రీమన్నారాయణ 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల్లో ఉపయుక్తంగా ఉండే ఎగ్జామ్‌ప్యాడ్లు, కంపాస్ బాక్సులు, స్కేళ్లు, పెన్నులు పంపిణీ చేశారు.





పోలీసుల అత్యుత్సాహం- ప్రజలకు అవస్థలు

- వైసీపీ సభ కోసం ఎస్ఎన్ పాలెం వద్ద బైపాస్‌పై నిలిపేసిన వాహనాలు
- భారీ వాహనాల పార్కింగ్‌తో సర్వీస్ రోడ్డులో నిలిచిపోయిన రాకపోకలు
- ఇబ్బందిపడ్డ వాహనాల డ్రైవర్లు, స్థానికులు




పెరికీడు వద్ద సర్వీస్ రోడ్డుపై నిలిపేసిన భారీ వాహనాలు.. ఎస్ ఎన్ పాలెం వద్ద ట్రాఫిక్ మళ్లిస్తున్న పోలీసులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 3 : వైసీపీ సభ కోసం పోలీసులు ప్రదర్శించిన అత్యుత్సాహం, స్వామి భక్తితో సామాన్య ప్రజలు, వాహన డ్రైవర్లతో పాటు ప్రయాణికులు నరకం అనుభవించారు. దెందులూరులో శనివారం నిర్వహించిన సభకు మధ్యాహ్నం సీఎం జగన్ వస్తున్నారన్న నెపంతో ఉదయం నుంచే జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను మళ్లించడంతో పాటు భారీ వాహనాలను సర్వీస్ రోడ్లపై ఆపివేశారు. అత్యవసరలోడుతో (పచ్చి కూరగాయలు, చేపలు)ఉన్నా ఆపివేశారని వాహన డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తోడు ఎస్.ఎన్.పాలెం వద్ద హనుమాన్‌జంక్షన్ బైపాస్‌లో జాతీయ రహదారిపై బారికేడ్లను అడ్డుగా పెట్టి పోలీసులు పహారా కాయడంతో దూర ప్రయాణాలు చేసే వారు పలు ఇబ్బందులెదుర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడు, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హనుమాన్‌జంక్షన్ వచ్చిన సమయంలో తమకు పట్టనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులు సుమారు 30 కి.మీ అవతల దెందులూరులో వైసీపీ సభ జరుగుతుంటే ఇక్కడ హడావుడి చేయడం చూసి స్థానికులు నవ్వుకున్నారు. పోలీసులు భారీవాహనాలను సర్వీస్ రోడ్డుపై పార్కింగ్ చేయించడంతో సర్వీస్ రోడ్డు మొత్తం భారీ వాహనాలతో నిండిపోయాయి. దీంతో చుట్టు ప్రక్కల గల గ్రామాలైన కె.సీతారాంపురం, పెరి కీడు, ఎస్.ఎన్.పాలెం, వేలేరు వెళ్లే స్థానిక ప్రజలతో పాటు చెరుకు, పామాయిల్ ఫ్యాక్టరీలకు తరలించే రైతులు ఇబ్బందులెదుర్కొన్నారు. రాజకీయ పార్టీ సభ కోసం ప్రజలను ఇబ్బంది పెట్టడం ఏమిటంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ కార్యదర్శి గోపీచంద్



గన్నవరం పార్టీ కార్యాలయంలో ఉంగుటూరు మండల టీడీపీ బూత్ ఇన్‌చార్జులకు శిక్షణ



బాపులపాడు టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న దయాల రాజేశ్వరరావు

ఉంగుటూరు, ఫిబ్రవరి 3 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు ప్రకటించిన పథకాల ద్వారా ప్రజలకు కలిగే లబ్ధిని వివరిస్తూ, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ కార్యదర్శి గోపీచంద్ బూత్ ఇన్‌చార్జులకు సూచించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహణపై ఉంగుటూరు మండలంలోని బూత్ ఇన్‌చార్జులకు గన్నవరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచార కార్యక్రమం, ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ తదితర అంశాలపై బూత్ ఇన్‌ఛార్జులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోపీచంద్ మాట్లాడుతూ, బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని అన్ని బూత్‌లలో బూత్ ఇన్‌చార్జులు ప్రారంభించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలద్వారా ప్రతికుటుంబానికి కలిగే లబ్ధిని వివరించడంతోపాటు పార్టీ నిర్దేశించిన బాండ్లను ప్రజలకు అందజేయాలన్నారు ఈ సమావేశంలో ఐటీడీపీ నాయకులు ఓంసాయి, సూరపనేని మహేష్, ఉంగుటూరు మండల ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనోక్, క్లస్టర్, యూనిట్, బూ త్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

బాపులపాడు టీడీపీ కార్యాలయంలో..

హనుమాన్‌జంక్షన్ : పేద వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేసిన టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయడంకా మోగించేలా కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర పొలిటికల్ ఇన్‌చార్జి కాసగాని శ్రీనివాసరావు ప్రతినిధి బృందం కోరింది. శనివారం బాపులపాడు మండల టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరావు అధ్యక్షతన క్లస్టర్, యూనిట్, పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలకు ఓటరు వెరిఫికేషన్, కుటుంబ సారధుల నియామకం తదితర అంశాలపై శ్రీనివాసరావు ప్రతి నిధి బృందం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతినిధి బృందంలో ఎం. దిలీప్, ఐటీడీపీ సభ్యులు కట్టా జయస్వామి, షేక్ జాని, ఉప్పలపాటి ప్రవీణ్, లావు వంశీ, కొల్లూరి నాగరాజు, పలగాని మహేష్ ఉన్నారు. సమావే శంలో మండల కార్యదర్శి పుట్టా సురేష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు కలపాల సూర్యం తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ సిద్ధార్థలో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పెనమలూరు, ఫిబ్రవరి 3 : అమెరికన్ ఆధారిత బహుళ జాతి కంపెనీకి రూ. 16 లక్షల వార్షిక వేతనంతో 26 మంది వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ విభాగాల విద్యార్థులు ఈ ఎంపికల్లో పాల్గొన్నట్లు యాజమాన్యం తెలిపింది. అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కళాశాల వైస్‌ప్రెసిడెంట్ మలినేని రాజయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

దళిత గర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 3 : కంకిపాడులో టీడీపీ జనసేన ఆధ్వర్యంలో ఈ నెల 11న జరిగే దళిత గర్జన పోస్టర్‌ను శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ బహుజన వర్గాల కన్నీటికి కారణమైన సైకో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి పెనమలూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో దళితులు కదిలి రావాలని పిలుపునిచ్చారు. పోస్టరు ఆవిష్కరణ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, సుదిమళ్ల రవీంద్ర, కొండా ప్రవీణ్, చేకుర్తి యోగిబాబు, వేమూరి ప్రసాద్, వినుకొండ రాజా, ఉయ్యూరు మహేష్, లాం కోటయ్య, కొంద్రు కోటేశ్వరరావు, లాం చంద్రరావు, జాలి కోటేశ్వరరావు, మోటుపల్లి భాగ్యరాజు, పండుల రజిని, ప్రశాంత్, వెలిశెల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సమర్థతకు ఓటేయండి

చలివేంద్రపాలెం (కంకిపాడు), ఫిబ్రవరి 3 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకుడిని గెలిపించాలని పెనమలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్‌రామ్ అన్నారు. మండలంలోని చలివేంద్రపాలెంలో శనివారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్‌రామ్ మాట్లాడుతూ, పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఐదేళ్లు, ప్రతిపక్ష నాయకుడిగా మరో ఐదేళ్లు బోడె ప్రసాద్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. వలస నాయకులను గెలిపించుకుంటే ప్రజలకు అందుబాటులో ఉంటారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎం. రంజిత్, గ్రామ పార్టీ అధ్యక్షులు బి. శ్రీనివాసరావు, ఏవీ దినేష్, కె. గోవింద్, నాని, ఆర్. మహేష్, బి. రామకృష్ణ, బి. ప్రభుకుమార్, కె. సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రపాలెంలో టీడీపీ మేనిఫెస్టో వివరిస్తున్న బోడె ప్రసాద్ తనయుడు వెంకట్‌రామ్

సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడులు



మామిడిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ కనకమహాలక్ష్మి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 3 : మేలైన నీటి యాజమాన్యంతో కూడిన సస్యరక్షణ చర్యలతో మామిడిలో నాణ్యమైన అధిక దిగుబడులు సాధ్యమని మామిడి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కనకమహాలక్ష్మి సూచించారు. మల్లవల్లిలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిం చిన మామిడి రైతుల అవగాహన సదస్సులో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతితో కలిసి పాల్గొన్నారు. మామిడితోటలో నిర్వహించిన సదస్సులో క్షేత్రస్థాయిలో పూత, పిందె దశలను చూపిస్తూ నీటి యాజమాన్య పద్ధతుల్లో తీసుకోవాలిసిన చర్యలపై రైతులకు వివరించారు. మామిడిలో నాణ్యమైన దిగుబడి సాధించేలా రైతులకు ఉద్యాన శాఖ ద్వారా సహాయసహకారమందిస్తామని జిల్లా అధికారి జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్టుబోయిన నాగమణి, ఎంపీ టీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, మండల అగ్రి బోర్డు సభ్యుడు షేక్ రఫీ, మండల ఉద్యాన శాఖ అధికారి హరిశ్చంద్, తూము రాధాకృష్ణ పాల్గొన్నారు.

మహాశక్తితో మహిళలకు ఆర్థిక స్వావలంబన



అంపాపురం తెలుగు మహిళా కమిటీతో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 3 : మహిళల ఆర్థిక స్వావలంబనకు టీడీపీ ప్రకటించిన మహాశక్తి పథకం దోహదపడుతుందని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి అన్నారు. అంపాపురం టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో తెలుగు మహిళ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షురాలిగా కోటకుండ రమాదేవి, కార్యదర్శిగా చిలకంటి అరుణ, తదితరులతో పాటు 20 మందితో కూడిన మహిళా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబునాయుడు మహిళలకు ప్రకటించిన ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం పథకాల ద్వారా నగదు జమ, గ్యాస్ సిలండర్లు, ఉచిత బస్సు ప్రయాణం లాంటి ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. మహాశక్తి పథకాలపై గ్రామాల్లోని మహిళలకు అవగాహన కల్పించాలని మహిళ కమిటీ సభ్యులకు సూచించారు. నిబంధనల పేరుతో కోతలు లేకుండా టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహాశక్తి పథకాలను అమలు చేస్తామని తెలియజేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధి, మహిళల ఆర్థిక స్వావలంబనకు టీడీపీకి మద్దతుగా మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ టీడీపీ విజయానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నూరెడ్డి జ్యోతి, సుంకర శాంతిశ్రీ, కొడాలి జ్యోతి, చిలకంటి ఏసు, బుజ్జి, వరలక్ష్మి, మెట్టపల్లి సువార్త, మహాలక్ష్మి, దుర్గాజయశ్రీ, మోతుకూరి తేజశ్వి, విజయదుర్గ తదితర మహిళలు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో మార్పులపై అవగాహన

పెనమలూరు, ఫిబ్రవరి 3 : శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా జరుగుతున్న మార్పుల కనుగుణంగా ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పరిశ్రమలతో భాగస్వామ్య సదస్సును నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల తెలిపారు. ఈ సదస్సు ద్వారా నైపుణ్యాభివృద్ధి, భాషా ప్రావీణ్యం, కృత్రిమ మేధలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ ధనేకుల రవీంద్రనాధ్ ఠాగూర్, కార్యదర్శి భవానీ ప్రసాద్, డైరెక్టర్ రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.33

బసవతారకం కేన్సర్ ఆసుపత్రికి రావెళ్ల రూ.లక్ష విరాళం



చల్లపల్లి, ఫిబ్రవరి 3 : హైదరాబాద్‌కు చెందిన బసవ తారకం కేన్సర్ ఆసుపత్రికి మంగళాపురం గ్రామానికి చెందిన రావెళ్ల కృష్ణ కన్వెన్షన్ అధినేత రావెళ్ల ఉదయ్‌కుమార్ లక్ష రూపాయల విరాళం అందజేశారు. తన స్నేహితుడు తేజతో కలిసి కేన్సర్ ఆసుపత్రి, బసవతారకం ట్రస్ట్ చైర్మన్ నందమూరి బాలకృష్ణకు రూ.లక్ష చెక్కును అందజేశారు. ఉదయ్‌తోపాటుగా శశిమాధవి కన్‌స్ట్రక్షన్ అధినేత కిలారి సోమశేఖర్ మరో లక్ష రూపాయల విరాళాన్ని బాలకృష్ణకు అందజేశారు.



డీఆర్వో రోజాను సత్కరిస్తున్న ఆర్డీవో వాణి, కలెక్టరేట్ అధికారులు

డీఆర్వో రోజాకు సత్కారం

మచిలీపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా గుంటూరు డీఆర్వోగా బదిలీ అయ్యారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపుహాలులో శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఆర్డీవో ఎం. వాణి, డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెట్‌లు, అధికారులు, సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. కృష్ణాజిల్లా కలెక్టరేట్‌లోనే తాను ఉద్యోగంలో చేరానని, జిల్లాతో తనకు ఎంతో అనుబంధం ఉందని రోజా అన్నారు.



ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

భూహక్కు చట్టం రద్దు కోసం వినూత్నంగా నిరసన

మచిలీపట్నం టౌన్ : ప్రజలకు హాని చేస్తున్న చట్టాలపై పోరాడేందుకు ఎంతటి ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామని, అవసమైతే భూ హక్కు చట్టం రద్దు కోసం అసెంబ్లీని ముట్టడిస్తామని మచిలీపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తుంగల హరిబాబు అన్నారు. భూహక్కు చట్టం రద్దు కోరుతూ జిల్లా కోర్టు వద్ద న్యాయవాదులు ఒంటి కాలిపై న్యాయదేవత విగ్రహం ఎదుట శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష నాయకులతో చర్చించి భూ హక్కు చట్టాన్ని రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మాదివాడ వెంకట నరసింహారావు, మచిలీపట్నం న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి కొట్టె రఘురాం, న్యాయవాద గుమస్తాల సంఘం ప్రధాన కార్యదర్శి పి.వి.ఫణికుమార్, న్యాయవాదులు విజయకుమారి, శరణ్య, పోతురాజు, జి.వి.ఎల్.నరసింహారావు, లంకే వెంకటేశ్వరరావు, నారగాని హనుమంతరావు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణారావును సత్కరిస్తున్న ఎస్.వి.ఎల్ యాజమాన్యం

ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

అవనిగడ్డ : అవనిగడ్డ ఎస్.వి.ఎల్.కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. పాలమూరుకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఇంటర్మీడియట్ తర్వాత చదివే కోర్సుల వివరాలను వివరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి : కమిషనర్

గుడివాడ : గుడివాడ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతానని నూతన మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు నేరుగా తన దృష్టికి సమస్యలను తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పురపాలక సంఘ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలిచ్చి కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంకు స్వాగతం పలికారు.



మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం



తెలుగు మహిళల సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు నీలిమ



చిన్నకళ్లేపల్లిలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు



తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న మండలి వెంకట్రామ్

జగన్ ప్రభుత్వానికి కాలం చెల్లింది

తెలుగు మహిళల సమావేశంలో కొల్లు నీలిమ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 3 : వైసీపీ ఐదేళ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో జగన్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ అన్నారు. మచిలీపట్నం టీడీపీ అసెంబ్లీ నియోజక వర్గ కార్యాలయం వద్ద శనివారం తెలుగు మహిళలతో విస్తృత సమావేశం నిర్వహించారు. కొల్లు నీలిమ మాట్లాడుతూ, మహిళలకు తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. మహిళలకు ఆస్తిలో సగం వాటా ఇచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కిందన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన అన్న క్యాంటీన్ వంటి పేదలకు ఆదుకునే పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని దుయ్యబట్టారు. టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలను పునరుద్ధరిస్తారన్నారు. మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, నాయకులు లంకే నారాయణ ప్రసాద్, మరకాని పరబ్రహ్మం, రామదేను వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లెబాట జయప్రదం చేయండి : వర్లకుమార్ రాజా

పామర్రు : గ్రామాల్లో సమస్యల పరిష్కర సాధన కోసం ఐదో తేదీ నుంచి టీడీపీ చేపట్టే పల్లె బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా కోరారు. ఎన్టీఆర్ విగ్రహం నుంచి పల్లెబాట ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. నెల రోజులపాటు 106 గ్రామాల్లో పల్లెబాట సాగుతుందన్నారు. ప్రజలు, టీడీపీ శ్రేణులు బాగస్వాములు కావాలని విజ్ఞప్తిచేశారు.

టీడీపీ వెంటే గ్రామీణ ప్రాంత ప్రజలు

ప్రజలు టీడీపీ, జనసేన వెంటే ఉన్నారని రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు కుంచే నాని అన్నారు. ఎస్ఎన్ గొల్లపాలెంలో శనివారం బాబు ష్యూరిటీ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంటింటికీ పర్యటించారు. చంద్రబాబు మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను కుంచే నాని వివరించారు. వైసీపీ ఐదేళ్ల రైతుల ఇబ్బందులకు గురయ్యారు. టీడీపీ నాయకులు కొనకళ్ల గోపీ, కొండేటి సుబ్రహ్మణ్యం, కొల్లేటి సురేష్, కొనకళ్ల మధు తదితరులు పాల్గొన్నారు.



ఎస్.ఎన్.గొల్లపాలెంలో కరపత్రాలు అందజేస్తున్న కుంచె నాని

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి

ఘంటసాల : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని టీడీపీ నేతలు అన్నారు. చిన్న కళ్లేపల్లి గ్రామంలో బూత్ నెంబర్-31లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేయటంతోపాటు ఏపీలో టీడీపీ - జనసేన ఉమ్మడి ప్రభుత్వం వస్తే అమలు చేసే ఆరు పథకాలను వివరించారు. టీడీపీ బూత్ ఇన్‌చార్జ్ కొడాలి వెంకట సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ గుత్తికొండ ప్రసాద్, హేమంత్, నాగార్జున, ఉదయ్ కిరణ్, గోపి పాల్గొన్నారు.

జగన్ మాయమాటలు నమ్మొద్దు : వెంకట్రామ్

అవనిగడ్డ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాయమాటలు చెప్పి మరలా అధికారంలోకి రావాలని చూస్తున్నారని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. శనివారం అవనిగడ్డలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడితేనే మళ్లీ మార్పు సాధ్యమవుతుందన్నారు. టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నేతలు యాసం చిట్టిబాబు, ఘంటసాల రాజమోహనరావు, యాసం లంకమ్మ, మొగల్ మురాద్ బేగ్, బండే రాఘవ, కొల్లూరి వెంకటేశ్వరరావు, బచ్చు రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి వెనిగండ్ల సాయం



గుడివాడ : కులమతాలకు అతీతంగా ఆపన్నులను ఆదుకోవడమే లక్ష్యం గా వెనిగండ్ల రాము సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు అన్నారు. నెహ్రూచౌక్ సెంటర్‌లో సోడాలు విక్రయిస్తూ జీవన సాగిస్తున్న 32వ వార్డుకు చెందిన ఓగులూరి కొండలు, పార్వతి దంపతులకు తోపుడు బండిని అందజేశారు. వాసే మురళీ, గోకవరపు సునీల్, ముళ్ళపూడి రమేష్, బాలసాని భవాని, కోలవెన్ను గోపాలకృష్ణ, బురాడ మధు, చుక్కా వెంకటేశ్వరరావు, చెరుకూరి జగన్మోహనరావు, పెద్దు శ్రీకాంత్, కడియాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు సాక్ష్యం చెప్పిన వ్యక్తికి హైకోర్టు షాక్

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఏసీబీ ట్రాప్ కేసులో అబద్ధపు సాక్ష్యం చెప్పిన ఓ ఫిర్యాదుదారుడికి హైకోర్టు షాక్ ఇచ్చింది. ఓ అధికారి తన నుంచి లంచం డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేసిన వ్యక్తి.. విచారణ సమయంలో మాట మార్చారు. అధికారిపై తప్పుడు ఆరోపణలు చేశానని చెప్పారు. దీంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐపీసీ సెక్షన్ 191, 193 కింద ఆయనను ప్రాసిక్యూట్ చేసేందుకు వీలుగా మూడు వారాల్లో సంబంధిత చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయాలని విజయవాడ ఏసీబీ కోర్టును ఆదేశించింది. అధికారి చంద్రశేఖర్‌కు విధించిన శిక్షను అమలు చేసేందుకు వీలుగా తీర్పు కాపీతో పాటు, కేసుకి సంబంధించిన రికార్డులను ఫిబ్రవరి 5లోగా ప్రత్యేక మెసెంజర్ ద్వారా ట్రయల్ కోర్టుకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. తీర్పు అమలుకు సంబంధించి నివేదికను తమ ముందు ఉంచాలని కోరింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి. రవీంద్రబాబు ఇటీవల తీర్పు ఇచ్చారు. ఫిర్యాదుదారుడు హోస్టైల్ సాక్షిగా మారినప్పటికీ ఇతర సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకుని ఏసీబీ కోర్టు విధించిన శిక్షను న్యాయమూర్తి సవరించారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7 మేరకు ఏసీబీ విధించిన ఏడాది జైలు శిక్షను రద్దు చేశారు. అదేసమయంలో సెక్షన్ 13 ప్రకారం విధించిన శిక్షను సమర్థించారు.

విషయం ఇదీ

కృష్ణాజిల్లా, మచిలీపట్నం మున్సిపల్ కార్యాలయంలో సంకుల చంద్రశేఖర్ 1997-2003 మధ్య శానిటరీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఈ క్రమంలో ఓ బియ్యం దుకాణంపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు రూ.5000 లంచం డిమాండ్ చేశారని, మచిలీపట్నం ప్రాంతానికి చెందిన ఎం. మురళీధర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారి చంద్రశేఖర్‌పై 2003 జూలై 17న విజయవాడ రేంజ్ ఏసీబీ డీఎస్పీ కేసు నమోదు చేశారు. అదే రోజు సాయంత్రం ఇంటి వద్ద లంచం తీసుకుంటుండగా చంద్రశేఖర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సొమ్మును సీజ్ చేశారు. అవినీతి నిరోధక చట్టం 1988లోని సెక్షన్ 7, సెక్షన్ 13(1)(డీ)రెడ్ విత్ 13(2) కింద కేసు నమోదు చేశారు. సీఆర్పీసీ సెక్షన్ 164 కింద ఫిర్యాదుదారుడు మురళీధర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేశారు.

ఈ కేసు విచారణ సందర్భంగా ఏసీబీ కోర్టు సాక్ష్యులను ప్రశ్నించింది. ఫిర్యాదుదారుడు మురళీధరరావు శానిటరీ అధికారి చంద్రశేఖర్‌పై తాను చేసిన ఆరోపణలు అన్నీ వాస్తవాలు కావని చెప్పారు. కేసుకి సంబంధించిన సాక్ష్యాలను, ఇతర ఆధారాలను పరిగణనలోకి తీసుకొన్న ఏసీబీ కోర్టు చంద్రశేఖర్‌కు ఏడాదిపాటు సాధారణ జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధించింది. అలాగే, సెక్షన్ 13(1)(డీ)రెడ్ విత్ 13(2) కింద ఏడాది జైలుశిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ 2007లో తీర్పు ఇచ్చింది. ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ చంద్రశేఖర్ అదే ఏడాది హైకోర్టులో అప్పీల్ వేశారు. ఈ అప్పీల్‌పై హైకోర్టు న్యాయమూర్తి ఎ.వి. రవీంద్రబాబు ఇటీవల విచారణ జరిపారు. చంద్రశేఖర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రాసిక్యూషన్ వాదనతో ఫిర్యాదుదారుడు విభేదిస్తున్నారని తెలిపారు. సీఆర్పీసీ సెక్షన్ 164కింద వాంగ్మూలం ఇవ్వాలని ఏసీబీ అధికారులు ఒత్తిడి చేసినట్లు ఫిర్యాదుదారుడే చెప్పారన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఫిర్యాదుదారుడు ఏసీబీ కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పారని అభిప్రాయపడ్డారు. పైవిధంగా తీర్పు చెప్పారు.

మెగా డీఎస్సీ కాదు... దగా డీఎస్సీ : టీడీపీ నేతల ధ్వజం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 3 : నిరుద్యోగులను సీఎం జగన్మోహనరెడ్డి మరోసారి వంచించాడని, మెగా డీఎస్సీ కాదని దగా డీఎస్సీ అని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ ధ్వజమెత్తారు. శనివారం తన కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50,892 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉంటే 6100 కు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను వంచించడమే అవుతుందన్నారు. . కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జగన్మోహనరెడ్డి కొత్త డ్రామాకు తెరతీశారన్నారు. **అవనిగడ్డ :** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన డిఎస్సీ ఒక దగా డిఎస్సీ అని నియోజకవర్గ టీడీపీ నాయకులు పేర్కొన్నారు.. దాదాపు 50 వేల పైచిలుకు ఖాళీలు ఉంటే కేవలం 6100 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, డిఎస్సీ పేరుతో ఐదేళ్లపాటు నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందన్నారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, మేడికొండ విజయ్, ఘంటసాల రాజమోహనరావు, మండలి రామ్మోహనరావు, యలవర్తి చిన్నా, యలవర్తి ఆది, కొట్టే విజయ్, పులిగడ్డ నాంచారయ్య, కొండవీటి గోవింద్, రేపల్లె అంకినీడు, కొండవీటి పాండురంగారావు, రేపల్లె మాధవరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలశౌరికి కాపు సంక్షేమ సంఘం మద్దతు




అవనిగడ్డ : జనసేనలో చేర నున్న మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిని శ్రీ కృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సంఘం నేతలు శనివారం కలసి ఆయనకు మద్దతు ప్రకటించారు. నాగాయలంకకు చెందిన శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిన్నారి, కార్యదర్శి బండ్రెడ్డి మురళీ గుంటూరులో బాలశౌరిని కలసి రాబోయే ఎన్నికల్లో బాలశౌరికి తమ మద్దతు ఉంటుందని తెలియజేశారు.



తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్‌కు ఘనంగా వీడ్కోలు

కూచిపూడి : మొవ్వ తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్ బదిలీపై కోనసీమ జిల్లా అమలా పురం వెళ్తున్న సందర్భంగా శనివారం మొవ్వలో కార్యాలయ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండల ప్రజానీకానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్ దంపతులను పూలమాలలు, దుశ్శాలు వాలతో ఘనంగా సత్కరించారు. ఆర్ఐ విజయలక్ష్మి, కార్యాలయ అధికారులు, సిబ్బంది తోపాటు గ్రామస్థులు పోతుల చిట్టిబాబు, కెపిసి.శర్మ, సుధీర్, నరసింహారావు, నాగేశ్వరరావు, రమణ, రాధాకృష్ణ, రాజేంద్ర, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

మచిలీపట్నం టౌన్ : చిలకలపూడి నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు విడియాల చక్రవర్తి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఉప్పలపు వెంకట కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తెలుసుకోవాల్సిన పలు అంశాలను ఉదాహరణలతో వివరించారు. ఉపాధ్యాయులు ఏ.వి.రామాంజనేయులు, జయ, సుధారాణి, వెంకటేశ్వర్లు, ఇబాదతుల్లా మాట్లాడారు.



రాజయ్య సేవలు చిరస్మరణీయం

● **స్మారక స్థూపం వద్ద టీడీపీ నేతల నివాళి**

కోడూరు : టీడీపీకి జరుగు రాజయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని, 1983 నుంచి క్రియాశీలకంగా ఆయన పార్టీకి పని చేశారని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. జరుగువానిపాలెంలో రాజయ్య కుమారులు జరుగు వెంకటేశ్వరరావు, జరుగు జనార్దన్, జరుగు నరేంద్ర ఏర్పాటు చేసిన రాజయ్య స్మారక స్థూపాన్ని ఆయన ప్రారంభించి శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కడవకొల్లు నాంచారయ్య, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లికార్జునరావు, తోట రాంబాబు, తోట సాంబశివరావు, మేడా శివాజీ, వేములపల్లి శ్రీకృష్ణ, కోట సుబ్బారావు, కూరాకుల ప్రసాద్, కూరాకుల శివ య్య, రేపల్లె ప్రతాప్, జాన్ విల్సన్, పూతబోయిన శ్రీనివాసరావు, బొడ్డు వెంకన్న, చిన్న భూశంకరరావు, అప్పికట్ల రవీంద్రబాబు, అప్పికట్ల నరసింహారావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు నాగాయలంకలో ఉచిత కంటి వైద్య శిబిరం

నాగాయలంక : నాగాయలంక మారుతీ విద్యానికేతన్ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు సుదర్శి మానవతా సేవా సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ తెలిపారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షించి, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అవసరమైన వారికి ఒక అపరేషన్లు చేయిస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా రఘుశేఖర్ కోరారు.